# మెట్లు

సాయంత్రం అయిదు గంటలయింది.

ఆఫీసు పని చాలించి ఇంటికి వెళ్ళిపోదామని మహా ఇదిగా వుంది.

పడమటి కిటికీలోనుండి కనిపిస్తున్న సూర్యుడి ముఖంలా ఎఱ్ఱటి అక్షరాలున్న అర్జెంటు ఫైలును చూడగానే అరికాలి మంట నెత్తి కెక్కిందినాకు. కాని తప్పదు. పేదవాడి కోపం పెదవికి చేటన్నారు.

విసుగ్గా ఫైలందుకుని డిస్పేచింగ్ బుక్‌లో ఎంటర్ చేసుకుని తిరిగి పంపేసాను—అవతలి వాడి సంతకం కోసం. బుక్ వచ్చేవరకూ వెయిట్ చెయ్యాలి.

మెల్లిగా పెద్దముల్లు మరో అరగంట ప్రాకింది గడియారంమీద, అప్పటికి ఎలాగో బుక్ వచ్చింది. పడేసి లాక్ చేసేసాను.

తిన్నగా ఇంటికి వెళ్ళి చన్నీళ్ళ స్నానం చేసి—ఈజీ ఛైర్‌లో కూర్చుని మా శ్రీమతి అందించిన తియ్యని కాఫీ ఎప్పుడు తాగుదామా అని వుంది నాకు. కాని అంతవరకూ ఆగడమే... అనుకుంటూ మున్సిపల్ ఆఫీసు బయటికి వచ్చేసరికి "హల్లో" అన్న పలకరింపు వినబడింది.

"ఓ...కేశవరావా" అంటూ తెల్లబోయాను. అతను బాతాఖానీ పెట్టేసి గంటల తరబడి కదలనివ్వడు.

"ఏవిటోయ్ ... అలా ఎటో చూస్తూ నిలబడ్డావ్ మాట్లాడకుండా—" అంటూ కదిపాడు కేశవరావు.

ఏం మాట్లాడను నా బొంద. నా ప్రోగ్రాంకి కేతువులా అడ్డు పడింది చాలక మాట్లాడాలట. మొహం చూడు మొహం, కాఫీ అంటూ కడు పేడుస్తూంటే...

'అబ్బే ఏం వున్నాయ్? ఆఁ ఎక్కడి కిలా వెళ్తున్నావ్?" అనడిగాను.

"నీ కోసమే ... చాలా విషయాలు చెప్పాల్సిన వున్నాయ్. అలా పద పార్కులోకి..."

ఓ భగవాన్! ఏమిటీ అగ్ని పరీక్ష!— వెళ్తే కడుపు మండి పోతుంది. వెళ్ళకుండా హోటల్లో దూరుదామంటే వీణ్ణి తీసుకువెళ్లాలి. 'మా శ్రీమతికేం బాగులేదు, ఇంటికి వెళ్ళా'లని కోసేద్దామంటే ఇంటి ప్రక్కనే ఇల్లాయె. పోనీ వీణ్ణి కూడా హోటలుకు తీసుకుపోదామా అంటే—అసలు జేబులో డబ్బులెన్నున్నాయ్...? ఫేంటు జేబులో చెయ్యి పెడితే అర్ధరూపాయి కాసోహటీ. పావలా కాసోహటీ, అయిదు పైసల కాసోహటీ తగిలాయ్. హా రామచంద్రా ... ఎనభై పైసలా— సరిగ్గా సరిపోతాయ్ రెండు టిఫిన్లికి, రెండు కాఫీలకీ ... అంటే ఈ ఎనభై పైసల్లో నలభై వీడి మొహాన్న తగలెయ్యాలా?—

'తొందరగా తెమలవోయ్' అంటూ కడుపు ఓగావు కేక పెట్టింది.

'పద' కాఫీ తాగిపోదాం, అన్నాను మాట వరస కన్నట్టుగా. అలా అంటే కనీసం మొగమాట పడి, 'అబ్బే ఇప్పుడెందుకోయ్ ... ఇప్పుడే తాగానుగా" అని వెళ్ళిపోనన్నా వెళ్ళిపోతాడూ... పీడా వదిలి పోతుందీ .. అనుకుంటూ. హాయిగా స్వీటు, హాటులతోపాటు కాఫీ తీసుకుంటున్నట్టు ఈస్ట్‌మన్ కలర్‌లో ఊహించుకుంటున్నాను. అబ్బే... ఒక్కసారిగా కరెంటు పోయినట్టు ఆగిపోయాయి ఊహలు—

'పదవోయ్.... కాఫీ గూడా పడాల్సిందే ... లేకపోతే అలాంటి బ్రహ్మాండమైన సంగతులు వింటే నువ్వు తట్టుకోలేవు కూడా..."

వీడి బొంద ... వీడి సంగతులు సంతకెళ్లా... చంపుతున్నాడు గదా బోరీశ్వరుడు...

హోటల్లో కూర్చున్నాం. రెండు ప్లేట్లు టిఫిన్ తెప్పించా.

"ఇది నీకు తెలుసా ... రామబ్రహ్మంగాడు ఎమ్మెస్సీ పాసయి పోయాడు. రాత్రీ పగలూ బట్టీ పట్టి రాసేవాళ్ళకి డిగ్రీ లిచ్చేస్తోంది. యూనివర్సిటీ. లేకపోతే వెధవ ఎస్సెల్సీ ఎన్నిసార్లు తప్పాడో ... పియ్యూసీలోనూ బియ్యేస్సీలోనూ లెక్చరర్లచేత ఎన్నిసార్లు తిట్లు తిన్నాడో...రికార్డు లెన్నిసార్లు రీరైట్ చేసేడో ఎవడికి తెలీదూ అలాటి వాడు ఇప్పుడెమ్మెస్సీ! వెధవకివ్వన్నీ జ్ఞాపకం లేవిప్పుడు. పలకరించడానికే కళ్ళు నెత్తిమీది కొచ్చాయ్. ఇదీ లోకనైజం "

"కేశవరావూ... నేనొక్కటి చెప్తా వింటావా... యూనివర్సిటీ వాళ్ళు డిగ్రీలిచ్చేటప్పు డందులో బట్టీ పెట్టేడో లేడో, కాగితాలు పెట్టే రాసేడో అదేమీ అందులో ఉండదుగదా ఎమ్మెస్సీ (బట్టీ)అనో లేకపోతే ఎమ్మెస్సీ (స్లిప్స్) అనో ఇవ్వరు గదా డిగ్రీలు. ఏదో కష్టపడి చదివాడు ... ఇంటలిజెన్స్ లేకపోయినా ఇండస్ట్రీతో పైకి వచ్చేడు. దానికే సంతోషిద్దాం. ఏమంటావ్?" అన్నాన్నేను.

"నిజమే కాదనను. కాని తెలివితేటలు లేవని ఒప్పుకోడే ... నువ్వింకా తెలివితేటలన్నావు ... కనీసం లోకజ్ఞానం కూడా లేదని నేనంటాను. ఆ మధ్య ... ఒరే ఆడ్రీ హేప్‌బర్న్ పిక్చరు వైజాగొచ్చింది. చూసావా అంటే ... "వాడి పిక్చర్లంటే నాకసహ్యం. వాడ్నెవరు హీరోగా బుక్ చేస్తారో తెలియదురా..." అంటాడు. ఆడ్రీ హేప్‌బర్న్ హీరోనో హీరోయినో తెలియదు. తెలియని వాడు వూరుకోడు ...

వీడేమో రేపొద్దున్న. లెక్చరరు చేస్తాట్ట ... లెక్చరరు .." అంటున్నాడు కేశవరావు.

ఆగకుండా బోరుకొడుతున్నాడు.

అయితే వాడు చెప్పేది వినకుండా నా మనను మరొకటి ఆలోచిస్తోంది. చక్కా ఇంటికి వెళ్ళి శ్రీమతి చేసిన కాఫీ తాగకుండా ఇదేం ఖర్మరా బాబూ ... నలభై పైసలు వాడికోసం ఖర్చుపెట్టేయడవే. ఆమాంతం ఓ ఐడియా పుట్టుకొచ్చింది.

ఒక్క కాఫీయే చెప్పా ...

కాఫీ రాగానే దాన్ని కసితీరా రెండు ముక్కలేచ్చని ... వాడికో ముక్క ఇచ్చాను తాగమంటూ. వాడేవనుకుంటే అనుకోనీ నాకు ఇరవై పైసలు మిగిలాయిగా.

మర్యాదకన్నా ఆ బిల్లు ఇలా ఇయ్యవోయ్ అన్నాడు కాదుగదా.

కడుపు నిండకపోయినా బాధలేదుగానీ ... ఈ బోరీశ్వరుణ్ణి ఎలాగైనా వదిలించుకోవాలనుంది. హాయిగా ఇంటికి వెళ్ళి స్నానం చేస్తేగాని ఈ చెవటకంపూ గట్రా వదలవ్...మరేంలేదూ ఈ మధ్యనే గదా నాకు పెళ్ళయిందీ ... శ్రీమతితో అదీ ఇదీ సర్దాగా మాటాడుకోవాలనుండదూ మరి ... అందుకే.

అందుకే వీడు బోరీశ్వరుడిలా కనబడుతున్నాడు. అయితే వీణ్ణి వదిలించుకోవటం నా చేతిలో లేనట్టుంది చూస్తుంటే—

"ఓయ్! పెద్దమావగా రొస్తున్నారు ... చూడు నా పక్కేలా చూస్తున్నాడో—

"ఎవడోయ్" విసుగ్గా అడిగాను. రోడ్డుమీద పోయిన పెద్ద మనుషులందరూ మావలూ, వాళ్ళమ్మాయిలు పెళ్ళాలూ; చిన్నవాళ్ళందరూ మరదళ్ళూ కింద వరసలు కట్టేసుకుని సంతోషపడి

పోతూంటారిప్పటి కుర్రకారు. అదేం బుద్ధో! ఆ తెల్లని షరాయీ తెల్లని చొక్కా వేసుకుని, అక్కడక్కడా పండిన వెంట్రుకలతో వున్నాయన వీడి మావగారట!

"ఊఁ అయితే?" అడిగాన్నేను.

"వాడి కూతురే శ్యామల"

శ్యామలని తెలియనివాడు కుర్రకారులో లేడనీ—ఆ అమ్మాయి వెనకాల ట్రై డెంట్సందరూ పడుతూండగా తా నొకసారి రక్షించాననీ చెప్పిందే పదిసార్లు చెప్తుంటాడు కేశవరావు. ఆ సంగతి జ్ఞాపకం వచ్చి కుతూహలం నటిస్తూ అడిగాన్నేను. "ఆఁ ఏవయ్యిందిట?"— నటించకపోతే ఏం చెయ్యను? ఎలానూ యిప్పుడప్పుడే ఇంటికి చేరే మార్గం లేదు.

"ఆ శ్యామలకి లెటర్ వ్రాస్తే—తిరిగి లవ్ లెటర్ వ్రాసింది."

"నువ్వెటు వెళ్తావ్ కేశవరావ్?" భారతానికి ఆనకట్టు వేసేస్తూ అడిగాను. వా డా తోవను పోతానంటే నే నీ తోవను—వాడీ తోవనంటే నే నా తోవను పోదామని ఐడియా వచ్చింది.

"పద నువ్వెటు వెళ్తే అటే వస్తా— నాకేం పనిలేదులే" అన్నాడు.

"హతోస్మి" అనుకుంటూ నిస్సహాయంగా నడుస్తున్నాన్నేను.

"ఓహో... కస్తూరి చాన్నాళ్ళకు కనిపించిందే... ఆంధ్రాబేంకిలో పన్జేస్తోంది తెలుసా? ప్రక్కనున్నాడే .. వాళ్ళ సెక్షను హెడ్డుట. మొత్తంమీద ఘటికురాలు కాబట్టి ఉద్యోగంతోపాటు వాణ్ణి కొంగున కట్టుకున్నట్టుంది."

హే రామచంద్ర ప్రభో! వీడి నోటివెంట ఎలాంటి అభాండాలు పలికిస్తున్నావు! కస్తూరి నాకు తెలుసు. కష్టపడి చదువుకుంది. పాపం... ఉద్యోగం చేస్తూ తమ్ముణ్ణీ, చెల్లెల్నీ చదివిస్తోందిప్పుడు.

మండిపోయింది నాకు.

మేంగళోర్ డ్రసెస్ లో పనుందంటూ మెట్లెక్కాను. అలాగైనా వాడి సొద వదుల్చుకుందామని. పద అంటూ మెట్లెక్కాడు కేశవరావునూ. నేను నీళ్ళుగారిపోయాను. వీడు "భువి దూరన్ భువిదూరు నబ్జితార..." అన్నట్టు తగులుకున్నాడు.

కాని ఆశ్చర్యం! వాడెందుకో మెట్లమీదనే నిలబడి పోయాడు షాపు లోనికి చూస్తూ... కొద్దిసేపయింతర్వాత... "అచ్చా... మరి నే వస్తా గురూ" అంటూ నే నింకా ఏవీ అనకుండానే కనుమరుగై పోయాడు. ఇంతసేపటి నుండి వదుల్చు కోవాలని చూస్తున్న ఆ పని చేయలేక పోయానే, వాడిమటుకు వాడు ఎలా వెళ్ళిపోయాడు చెప్మా అనుకుంటూ మేంగళోర్ డ్రసెస్‌లో అడుగు పెట్టాను.

ఎదురుగుండా శ్యామల కనబడ్డాది షాపులో.

ఓహ్హో ఇదన్న మాట సంగతి... ఏదో శృంగ భంగం చేసి వుంటుంది అని లోలోన నవ్వుకున్నాను.

మేంగళోర్ డ్రసెస్ ప్రొప్రయిటరు కొంచెం తెలిసినవాడు. ఏదో పలకరింపుగా మాట్లాడినట్టూ వుంటుందీ, కేశవరావును వదల్చుకున్నట్టూ వుంటుందని వచ్చాను గాని...నిజానికి నాకేమీ పనిలేదక్కడ.

అయితే షాపులో ఏవో పీసెస్ కొంటున్న వాడొకడు నా కళ్ళలో పడ్డాడు.

వాడు నా చిన్నతనం క్లాసు మేటు రంగనాథంలా కనుపించాడు.

మెల్లగా వెళ్ళి ఒక్కసారిగా పోల్చుకొని "హల్లో రంగనాథం" అన్నాను.

"హల్లో" అంటూ వెనుతిరిగాడు వాడు. వెంటనే పోల్చు కొన్నట్టు కనుబొమలెగరేసాడు కూడా. రంగనాథంతోపాటు మరికొంత మంది వున్నారు. వాళ్ళంతా కూడా ఖరీదైన పెర్లిన్లలో మునిగి తేల్తు న్నారు రంగనాథంలాగానే.

చిన్నప్పుడు రంగనాథం చాలా తెలివైనవాడు. ఎస్సెల్సీ వరకూ కలసే చదువుకున్నాం. నేనిలా మునిస్పాలిటీ ఎద్దులా సంసారపు బండి నీడుస్తున్నాను. వాడు పియ్యూసీ లో జేరటం వరకే తెలుసు. అప్పట్లో మేమిద్దరం క్లోజ్‌గా వుండేవాళ్ళం. అవన్నీ జ్ఞాపకంతెచ్చి వుక్కిరి బిక్కిరి చేసాయి నన్ను.

అంతవరకు కేశవరావు బోర్ కొట్టేశాడన్న సంగతి కూడా మర్చిపోయి హాయిగా, ఫ్రెష్‌గా అయిపోయి క్రొత్తఉత్సాహం వచ్చింది రంగనాథాన్ని చూడగానే.

"ఏం చేస్తున్నావోయ్?" అంటూ ముందు నేనే అడిగా.

"నీకు తెలీదూ. మెడిసిన్ కంప్లీటుచేసి ఈ ఊళ్ళోనే పన్జేస్తు న్నాను'' అని చెప్పాడు రంగనాథం.

పెద్ద హోదాలో-అంటే డాక్టరుగానో, ఇంజనీరుగానో, కలెక్టరు గానో ఉన్నవాళ్ళకి—పోనీ నాకే అనుకోండి...ఓ గుమస్తానో, ఎలి మెంటరీ స్కూలు మేస్టరో, పోలీసు కానిస్టేబులో లేకపోతే జేబులు కొట్టేవాడో స్నేహితుడో—కలిసి చదువుకున్నవాడో అయితే చెప్ప కోనూ చెప్పకోడు... పలకరించనూ పలకరించడు. కాని నాకన్నా పెద్ద హోదాలో వున్నవాడు, స్నేహితుడు కాకపోవచ్చు పరిచయం

ఉంటే చాలు... అవతలివాడు నన్ను చూసి తుమ్మకపోయినా, దగ్గక పోయినా వాడి నామస్మరణే చేస్తాను. అలాంటిది రంగనాథం వైమెట్టులో వుండి నన్ను పలకరించాడు

నాకు చాలా సంతోషం కలిగింది. నా ఫ్రెండొహ డాక్టర్. వీణ్ణి—ఇంత గొప్పవాణ్ణి నా ఫ్రెండని చెప్పుకోడానికి నాకే గర్వంగా వుంది. ఇలాంటి వాడితో కాసేపు హాయిగా మాట్లాడుకు తిరగాలనీ—వీడితో చేయీ చేయీ కలుపుకుని షికార్లు కొట్టాలని అన్పించింది.

కాని—కాని రంగనాథానికే ఇబ్బందిగా వున్నట్టుంది. వాళ్ళ ఫ్రెండ్స్ ప్రక్క మాటిమాటికి చూస్తున్నాడు. వాళ్ళకూడా వీడి ప్రక్కే చూస్తున్నారు.

అయితే రంగనాథానికి మాత్రం నాతో మాట్లాడాలని లేదూ—ఉండే వుంటుంది.

"మరింకేవిటి సంగతులోయ్?" అంటూ అడిగాడు.

"ఏమున్నాయ్ చెప్పు—నిన్ను చూస్తే చాలా సంతోషంగా వుందోయ్—" అంటూ మొదలుపెట్టి—అప్పుడో ముక్క ఇప్పుడో ముక్క మాట్లాడుతూ పావుగంట గడిపేసాను.

కొంత సేపయాక— "మరి వెళ్ళొస్తానోయ్" అన్నాను.

"అప్పుడే వెళ్ళిపోతావా—ఉండకూడదూ కాఫీతాగిపోదువు గానీ—" అన్నాడు.

"అబ్బే—లేదోయ్—ఇప్పుడే తాగాను— వస్తా" అని మొహ మాటంగా అంటూ అటు ప్రక్కవున్న ప్రొప్రయిటర్ గదిలోనికి వెళ్ళాను.

కాని షాపులో రంగనాథం, వాడి ఫ్రెండ్సూ మాట్లాడుకొంటున్న మాటలు మాత్రం సూటిగా గోడలోంచి దూసుకువస్తున్నాయ్.

"నువ్వు మాట్లాడి వచ్చేసరికి—అప్పుడే—హాయ్—ఒహ నిద్ర అయింది—" బద్ధకంగా ఆవలింతనటిస్తూ ఒహడూ, "అప్పుడే వచ్చేసావా—నేను మా మూడోవాడి చొక్కా కోసం వచ్చానిక్కడికి—" అని వ్యంగ్యంగా మరో బ్రహ్మచారీ అంటున్నారు. "కాఫీ గూడా ఇప్పిస్తాడుట ఆ బోర్ బాబుగారికి—" అంటూ మరో డందుకున్నాడు.

"ఆ పోనిస్తూ—చిన్నప్పటి స్నేహితుడుగ దాని వూరుకున్నాను. మరీ తాను బోర్ కొట్టేస్తున్నానన్న సంగతి వాడు గ్రహించుకోవాలి గానీ మన మెలా చెప్తాం—స్టేటస్ మర్చిపోయి ప్రవర్తిస్తారు.—ప్చ్— సరేగాని ఆ పెర్లిన్ తీసుకుందామా—" అంటూ రంగనాథం మాటలూ వాటికి లయగా అప్పుడప్పుడు నవ్వులూ ములుకుల్లా గుచ్చుకుని మనస్సు చివుక్కుమంది.

ఇంతవరకూ రంగనాథం పైమెట్టులో వుండి నన్ను పలకరించి మాట్లాడేడన్న సంతోషంలోనే ఉన్నాను. కాని అంతకుముందు నాకు క్రింది మెట్టులోవున్న కేశవరావు దగ్గర నే నెలా ప్రవర్తించానో, ఎలా వదలగొట్టుకోవడానికి చూసేనో మాత్రం ఆలోచించలేదు. నాకు కేశవరావు బోర్ అయితే—నేను రంగనాథానికి బోర్—రంగనాథం మరో పెద్ద డాక్టరుకి బోర్—

"పాపం ! కేశవరావు — ఉత్త వెర్రిబాగులవాడు" అనుకుంటూ వాడు పార్కులో ఉంటాడేమోనని అటుకేసి కదిలాను.

(పొలికేక)